

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఖాళీ సింహాసనం

**తన బీరువాని** ఎవరో దేనికోసమో వెదుకుతున్నారని సమీరకి బలంగా అనిపించసాగింది.

నాలుగురోజుల క్రితం ఆమె ఆ విషయం గుర్తించింది. ఆఫీస్‌కి వెళ్ళే హడావిడిలో బట్టల కోసం బీరువా తీసినప్పుడు కింది అరలోని చీరల మడతలు చెదిరినట్లు అనిపించింది. అరుదుగా కట్టుకునే చీరలు కాబట్టి, పొందికగా సర్దినవి సర్దినట్లే ఉంటాయి. మరి తనకెందుకలా అనిపించిందో! అప్పుడు హడావిడిలో అది మర్చిపోయింది. కానీ ఈ రోజు పై అరలో తను ఉంచిన ఫోటోలు, మెమరీ బాక్స్ స్థానచలనమైనట్లు అనుమానం వచ్చింది.

ఆ సాయంత్రం ఇంటికి రాగానే బీరువా తెరిచి మెమరీ బాక్స్, ఫోటోలు బయటకి తీసింది. మెమరీ బాక్స్‌లో కింద ఉండాల్సిన తన ఇంటర్మీడియెట్ హాల్ టిక్కెట్, తాతయ్యా నాయనమ్మల ఫోటో మధ్యకి వచ్చాయి. యం.సెట్ రేంక్ అడుక్కుపోయింది. బాబాయ్ కొనిచ్చిన గొలుసు, మెరుపు పోయి ఇనుపముక్కలా ఉన్న దాని లాకెట్ విప్పి ఉంది.

ఇంట్లో ఉండేది తామిద్దరే. పనిమనిషి ఉన్నా తాళం చెవులు ఆమెకి అందుబాటులో ఉండవు. తన వస్తువులతో గౌతమ్‌కి ఏం పని?

ఫోటోలుంచిన కవర్‌ని తీసింది. మొదటి ఫోటో తన ఫ్రెండ్స్‌తో తీసుకున్నది. అంతా కెమెరా వంక చూస్తూంటే, రోమియో తనవంకే చూస్తున్నాడు. సమీర బుగ్గలు ఎర్రబడ్డాయి.

రోమియో పేరు రజాక్. సమీర మీద తనకున్న ప్రేమని దాచడానికి ఏ మాత్రం ప్రయత్నించలేదు. నీడలాగా అతనో, అతని చూపో ఆమెని వెంటాడేవి. ఆ ప్రేమకి సమీర మనసు కూడా కొంచెం చలించింది. కులాలు వేరై ఉంటే పెద్దవాళ్ళని ఒప్పించే ప్రయత్నం చేసేదేమో కానీ మతాలు వేరవడంతో ఆ సాహసం చేయలేకపోయింది. ఆ విషయం అతనికి స్పష్టంగా మిత్రులద్వారా చెప్పింది. ప్రోత్సహించినట్లుగా ఉంటుందని అతనితో మాట్లాడేదికాదు, కనీసం అతన్ని చూసి నవ్వేది కూడా కాదు. కానీ అతను మాత్రం ఆమెని ఆరాధించడం మానలేదు. సమీర పెళ్ళికి కూడా వచ్చి తాజ్‌మహల్ బొమ్మని బహుమతిగా ఇచ్చాడు.

సమీర చూపుడువేలు అప్రయత్నంగా ఫోటోలోని అతని మొహం మీద సున్నితంగా కదలాడింది.

తర్వాతి ఫోటో పెళ్ళి సంబంధం వచ్చినప్పుడు మధ్యవర్తి ఇచ్చిన గౌతమ్ ఫోటో. పెళ్ళిచూపుల్లో అతను ఆమెకెంతో నచ్చాడు. సాధారణంగా ఓ మగవాడు ఆడదాన్ని చూసే చూపులు సమీరకి బాగా పరిచయం. కానీ గౌతమ్ చూపుల్లో ఆ కామం, కాంక్షలేవు. 'జెంటిల్ మేన్' అనుకుంది.

పెళ్ళి కుదిరాక ఆనందంతో గంతులు వేసింది. 'ఈ వేళలో నీవు ఏం చేస్తూ ఉంటావో' అని పాడుకునేది. అమ్మ రేడియో సిలోన్‌లో వినే పాతపాట 'యే జిందగీ ఉస్‌కీ హై'ని హమ్ చేసేది. ఎంగేజ్‌మెంట్‌కి పెళ్ళికి గల రెండువారాల ఎడంలో అతను తనకి ఫోన్ చేయలేదని, టెక్స్ట్ చేయలేదని ఉడుక్కునేది. తర్వాత అతను ఆఫీస్ పనిమీద జర్మనీ వెళ్ళాడని తెలిసి, చెప్పి వెళ్ళచ్చుగా అని కోపగించుకుంది.

ఈ ఊసులు, పాటలు అన్నీ విన్న (?) ఫోటో అది.

ఆ తర్వాతి ఫోటో తామిద్దరూ హనీమూన్‌కి డల్‌హౌసీ వెళ్ళినప్పటిది. ఆ చల్లటి వాతావరణంలో, కొండల్లో మొక్కల్లో చేతులు పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ తిరిగారు. గౌతమ్ మితభాషి అయినా అతనిలో వినే సహనం చాలా ఉందని అప్పటికే సమీర గ్రహించింది. తన చిన్ననాటి విషయాలు, కాలేజ్, ఫ్రెండ్స్, ఉద్యోగం.. ఇలా ఆమె చెప్తూంటే గౌతమ్ చిరునవ్వుతో వినేవాడు. అలా ఆరోజు వాకింగ్‌కి వెళ్ళినప్పుడు ఓ తోటి పర్యాటకుడు ముచ్చటపడి తమ కెమెరా తీసుకుని తీసిన ఫోటో అది. అందులో ఇద్దరూ ఎంతో ఆనందంగా ఈ ప్రపంచమంతా మాదే అనే ధీమాతో ఉన్నట్లుగా నవ్వుతున్నారు.

సమీర మొహంలో విషాదం ప్రవేశించింది. తమ మధ్య అపశ్రుతి దొర్లింది కూడా ఆ రోజే.

ఆ రాత్రి గౌతమ్ ఉన్నట్లుండి ఆమెని విదిలించుకుని బయటకి, బాల్కనీలోకి వెళ్ళిపోయాడు. బిత్తరపోయిన సమీర దుస్తులు సవరించుకుని బయటకి వచ్చి భర్తని అడిగింది.

"ఏమైంది? ఎందుకలా వచ్చేసారు?"

"ఏం లేదు." గౌతమ్ ముభావంగా చెప్పాడు.

"ఏదో ఉంది. చెప్పండి. ఈ సమయంలో మీరు ఇలా రావడం... బయట బాగా చలిగా ఉంది. లోపలకి వెళ్దాం" అర్థించింది.

"నువ్వెళ్ళి పడుకో!" విసురుగా చెప్పాడు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పెళ్ళయి వారం కాకుండానే కసురుకుంటున్నాడు.

"ప్లీజ్. రండి" చలికి పళ్ళు కటకట కొట్టుకుంటూండగా అడిగింది. ఏమనుకున్నాడో, మౌనంగా లోపలకి వచ్చి, మంచం మీద అటువైపు తిరిగి పడుకున్నాడు. ఆ రాత్రంతా సమీర మనసు రోదిస్తూనే ఉంది.

మర్నాడు దాదాపు అరగంట సేపు బ్రతిమాలాక అలకకి కారణం చెప్పాడు.

"నువ్వు నన్ను 'నువ్వు' అన్నావు."

"ఏమిటి?" నిర్ఘాంతపోయింది.

"నువ్వు నువ్వంటే నాకిష్టం లేదు. మీరు అనాలి."

ఆ మాట అత్తగారు కూడా చెప్పడం సమీరకి గుర్తుంది.

"కానీ నేను 'నువ్వు' అని ఎప్పుడన్నాను?" అయోమయంగా అడిగింది.

"రాత్రి. 'నువ్వు ఓ అద్భుతం గౌతమ్' అనలేదు?"

వెంటనే ఆ సందర్భం గుర్తొచ్చింది.

"అది ప్రశంస. రాత్రి పారవశ్యంలో అలా అని ఉంటాను." అవమానంతో చిన్నగా చెప్పింది.

"ఏ స్థితిలో ఉన్నా మీరు అనే అనాలి" కటువుగా చెప్పాడు.

ఆమె తల ఊపింది. 'ఓయీ అని పిలవాలని ఊహ కలిగెను' అనే పాతపాట గుర్తొచ్చింది.

ఆ తర్వాత చాలా రోజుల వరకు సమీర మామూలుగా ఉండలేకపోయింది. అప్పుడప్పుడు ఆ సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా ఆమెకి దుఃఖంగా ఉండేది.

"ఏం చేస్తున్నావు మీరా?" గౌతమ్ వచ్చి ఆమె పక్కన కూర్చుంటూ ప్రశ్నించాడు.

"ఏం లేదు. బీరువా సర్దుకుంటున్నాను" చెప్పింది.

ఆమె కాలేజ్ ఫోటోని చేతిలోకి తీసుకుని అడిగాడు గౌతమ్.

"మన పెళ్ళిలో మీ ఫ్రెండ్స్ 'రోమియో కూడా వచ్చాడు' అని నీతో చెప్పడం విన్నాను. అదేం పేరు? అనుకున్నాను కూడా. ఈ ఫోటోలో అతనున్నాడా?"

"ఆఁ ఉన్నాడు" వేలితో చూపించింది.

"పేరు తమాషాగా ఉంది." చెప్పాడు.

"అతని పేరు రజాక్.." సమీర అతని మూగప్రేమని వివరిస్తూంటే, ఎప్పట్లాగే గౌతమ్ మౌనంగా విని అడిగాడు.

"ఇప్పుడతను ఎక్కడున్నాడో తెలుసా?"

"తెలీదు. లక్షద్వీప్‌లోనో, పారాదీప్‌లోనో కస్టమ్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడని మొన్నామధ్య ఎవరో చెప్పారు. మన పెళ్ళయి ఈ ఊరు వచ్చేసాక మా పాత ఫ్రెండ్స్ ఎవరితో టచ్‌లో లేను." విచారంగా చెప్పింది.

"మీరా! నీ ఫోన్ ఒకసారి ఇస్తావా? అర్జెంట్ కాల్ చేసుకోవాలి. నా ఫోన్ డెడ్" బెడ్ రూంలోంచి అరిచాడు గౌతమ్.

"కిచెన్ ఫ్లాట్‌ఫాం మీద ఉండచ్చు. చూడండి." బాత్‌రూంలోంచి చెప్పింది సమీర.

"పాస్‌కోడ్ ఏమిటి?"

"1985. నేను పుట్టిన సంవత్సరం."

"ఓ.కే. గాటిట్" చెప్పాడు.

ఆ రాత్రి పనులు పూర్తయి బెడ్‌మీదకి చేరాక ఫోన్‌లో ఇ మెయిల్స్ చెక్ చేసుకుంటున్న సమీర ఆలోచనగా ఆగింది.

ఉమంగ్ నించి వచ్చిన ఈ మెయిల్ తను చదవలేదు. కానీ దాని పక్కన బ్లూ డాట్ లేదు. ఎవరో చదివినట్లుగా ఉంది.

అది అఫీషియల్ మెయిల్. ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్ళిన ఉమంగ్, పనిలో ఏదో డౌట్ వచ్చి క్లారిఫికేషన్ కోసం మెయిల్ ఇచ్చాడు.

గౌతమ్ తన మెయిల్స్ చూసేంత మేనర్స్ లేనివాడా?

"మీరా! రమణ అంటే ఎవరూ?" పక్కనే పడుకుంటూ అడిగాడు గౌతమ్.

"ఏ రమణ?" అయోమయంగా అడిగింది.

"అదే ఈ రోజు మధ్యాహ్నం పన్నెండున్నరకి నీకు కాల్ చేసిన రమణ."

"ఓ! రమణకుమారి, నా ఫ్రెండ్ వాళ్ళ ఆఫీస్‌లో లే ఆఫ్స్ ఎక్కువగా ఉన్నాయిట. భయంగా ఉంది, 'మీ ఆఫీస్‌లో ఏవైనా ఓపెనింగ్స్ ఉన్నాయా?' అని అడగడానికి చేసింది.... అవునూ, మీకెలా తెలుసు రమణ ఫోన్ చేసిందని?" ఒక్క ఉదుటున లేచి కూర్చుని అడిగింది.

"నీ ఫోన్ నించి అర్జెంట్ కాల్ చేసుకున్నాకదా? అప్పుడు చూసాను." గౌతమ్ తేలికగా చెప్పాడు.

"కాల్స్ లిస్ట్ చూడాల్సిన అవసరం ఏముంది?" చురుగ్గా అడిగింది.

"ఏం చూడకూడదా?" గౌతమ్‌కి కోపం వచ్చింది.

"అంటే?" సమీర్‌కి ఏదో అనుమానం వచ్చింది.

"నా బీరువాని వెదికింది, ఉమంగ్ మెయిల్‌ని చదివింది మీరేగా?"

"అవును."

"ఎందుకు?"

"ఎందుకంటే.. ఎందుకంటే?" మాటలకి తడుముకున్నాడు గౌతమ్.

"నామీద అనుమానమా?"

"ఓ రకంగా అంతే."

స్థాణువై అతనివైపే కళ్ళార్పకుండా చూస్తూండిపోయింది. రెండు నిమిషాల తర్వాత తమాయించుకుని అడిగింది.

"ఎందుకొచ్చింది?"

"నేను మాటకారిని కాదు. ఎదుటివాళ్ళని ఇంప్రెస్ చేయలేను. నువ్వలాకాదు. అందరితో గలగలా మాట్లాడతావు. నీకు పెద్ద ఫ్రెండ్ సర్కిల్ ఉంది. నా ఫ్రెండ్స్, కొలీగ్స్‌తో కూడా బిడియం లేకుండా మాట్లాడతావు. ఇంత మందితో అంత సరదాగా ఉండే నువ్వు పతివ్రతవంటే నమ్మాలా?" కోపంగా అడిగాడు.

సమీర విషాదంగా నవ్వింది.

"మీరు నా బీరువా, ఫోన్, ఈ మెయిల్.. అన్నీ వెదికారు నా రహస్యప్రియుడికోసం. కానీ ఒక్కచోట మాత్రం వెదకలేదు."

"ఎక్కడ?" గౌతమ్ ఆత్రంగా అడిగాడు.

"నా మనసు గదిలో. అక్కడ గోడకి భర్తగా మీ ఫోటో వేలాడుతోంది. కానీ నా సహచరుడి కోసం వేసిన సింహాసనం ఖాళీగా ఉంది. పెళ్ళికి ముందు నేను ఊహించుకున్న నా నేస్తం, సహచరుడు, నా స్నేహితుడు గోడకే వేలాడుతున్నాడు తప్ప దిగి ఆ కుర్చీలో కూర్చోవడం లేదు" దుఃఖంతో ఆగింది.

"అందరితో కలివిడిగా మాట్లాడటం నా స్వభావం. నేను బాధపడతానని బిడియం అని వాడారు కానీ మే బీ సిగ్గులేకుండా అని మనసులో అనుకుని ఉంటారు. అవును. ఎవర్ని చూసినా నాకు సిగ్గుగా అనిపించదు. ఇదేమాట మీరాబాయ్‌ని ఆమె భర్త అడిగాడట. 'నన్ను చూసి సిగ్గుపడవు. నాతో మాట్లాడాలి అనుకోవు. మగాడ్ని నాతో ఇలాగేనా ప్రవర్తించేది' అని. అప్పుడు మీరా గలగలా నవ్వి చెప్పిందిట. 'ఈ భూమి మీద ఏకైక పురుషుడు కృష్ణపరమాత్ముడే నా దృష్టిలో ఆయన తప్ప మిగిలిన మగాళ్ళమని చెప్పికునే వారంతా ఆడవాళ్ళే. సాటి ఆడదానితో మాట్లాడేప్పుడు ఎవరైనా సిగ్గుపడతారా?'

అలాగే గౌతమ్‌ని తప్ప నేను ఎవర్నీ మగాడుగా చూడను. అందుకే ఆడ, మగ అందరితో ఒకేలా ప్రవర్తిస్తాను. వాళ్ళమీద ఏ అభిప్రాయం, కోరికలేనప్పుడు సిగ్గుపడటం, మెలికలు తిరగడంలాంటివి ఎందుకు చేస్తాను?"

ఎప్పటిలా గౌతమ్ మౌనంగా వింటున్నాడు. 'ఆమె మంచిదే' అనే ఒక్క భావనతో అతని మొహం వికసించింది. మిగిలిన వాటిలో కొన్ని అర్థంకాకపోయినా బాధపడలేదు.

"కానీ ఇప్పుడు మీకా అర్హత పోయింది. మిమ్మల్ని చూసినా మా రమణని చూసినా ఒకే భావన" నిర్లిప్తంగా చెప్పింది సమీర.

**(వచ్చే సంచికలో మరో సరిగమ)**

Click here to share your comments